

ఉద్యోగోన్నతులు కల్పించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మెరిట్ ఆధారంగా ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలనే ఆలోచన విరమించి మెరిట్ ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం కడప జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్ రెడ్డి కోరారు. ఒక సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 20 నుంచి 25 సంవత్సరాలు పాటు ఒకే కేడర్‌లో పనిచేస్తున్నా ఉద్యోగోన్నతి లభించే అవకాశం కనబడట్లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో 17 పైగా సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నప్పుడు అందులో 70 శాతం ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని తెలిపారు. ఇదరూ ఖాళీగా ఏర్పడనున్న ఎస్‌జిటి పోస్టుల విషయంలో విద్యా వాలంటీర్లను నియమించాలని పేర్కొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ సుభాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

పాలస్తీనా పై దాడులు ఆపాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్ డిమాండ్ చేశారు. ఆదివారం బాలాజీ నగర్‌లోని ఉపాధ్యాయ భవనంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్‌ఒ), ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవాజ్ అధ్యక్షులు పి.చాంద్ బాషా అధ్యక్షతన 'పాలస్తీనా సంఘీభావ సదస్సు' నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి (యుఎన్ఒ) గుర్తించిన సభ్య దేశమైన పాలస్తీనాలోని 90శాతం భూభాగాన్ని అమెరికా అండదండలతో, ఇజ్రాయిల్ ఆక్రమించేసిందని తెలిపారు. 39 లక్షల మంది పాలస్తీనియన్లను వారి మాతృభూమికి దూరంగా ఉంచుతూ హత్య చేస్తున్నారు. స్థానిక పాలస్తీనియన్లు వారి దేశ స్వాతంత్ర్యం కోసం, పోరాడుతున్నారని తెలిపారు. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పిఎల్ఒ) అధ్యక్షులుగా 'యసర్ అరాఫత్', ఇజ్రాయిల్ ప్రధాని గా 'యిజాక్ రాబిన్'లు 1994లో శాంతి ఒప్పందం చేసుకొని పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండు ప్రజాస్వామ్య, లౌకిక దేశాలుగానూ మనుగడ కొనసాగించాలని నిర్ణయించుకున్నారన్నారు. అనంతరం 2006లో, 2017లో ఇరుదేశాల్లోనూ కూడా ఎన్నికలు యుఎన్ఒ పర్యవేక్షణలో జరిగాయని, నూతన ప్రజాస్వామ్య లౌకిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య, లౌకిక సంస్థలు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి ఉద్యమిస్తున్నాయన్నారు. పశ్చిమ ఆసియా సామ్రాజ్యవాదాన్ని తలొగ్గకుండా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా ముందుకు రావడానికి ఇది సరైన సమయం అన్నారు. పాలస్తీనా విముక్తి పోరాటానికి సంఘీభావంగా, ప్రజాస్వామ్య పాలస్తీనా ఏర్పడాలని, వారి దీర్ఘకాల జీవన్మరణ పోరాటం విజయం సాధించాలని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాటా ్లడుతూ పాలస్తీనాను ఆక్రమిస్తున్న ఇజ్రాయిల్‌ను భారత ప్రభుత్వం బలపరచకూడదని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ జియోనిజం లాగా హిందుయిజాన్ని బిజెపి మార్చే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పార్లమెంటులో 'వక్ఫ్ బోర్డు సవరణ చట్టం బిల్లు' బిజెపి నరేంద్ర మోడీ ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దానిని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి, తర్వాత సెట్ కమిటీకి, రాజ్యసభకు, పంపించి నిపుణులచే సలహాలు, సూచనలు తీసుకున్నాక, సమగ్ర చట్టం తీసుకురావాల్సి ఉండగా, ఏకపక్షంగా సవరణలు చేయడం అనేక అనుమానాలకు దారితీస్తోందన్నారు. దేశంలోని మైనార్టీ ప్రజల హక్కులు, భద్రత, భారత దేశ రాజ్యాంగం ఫెడరల్, లౌకిక వ్యవస్థ లక్ష్యాన్ని, లౌకిక, ప్రజాస్వామ్య... దానికి భిన్నంగా బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యవహరిస్తే దేశంలో అంతర్యుద్ధం ప్రారంభమవుతుందని హితవు పలికారు. ముస్లిం జెఎసి నాయకులు బాబు బాయ్ మాట్లాడుతూ భారతదేశంలో 9 లక్షల 40వేల ఎకరాల వక్ఫ్ బోర్డ్ భూములు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలో నేవీ, రైల్వే తర్వాత పెద్ద సంఖ్యలో బోర్డు భూములు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో 70 వేల ఎకరాలు ఉండగా 32వేల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలామా అయ్యమ్మ కమిటీ మౌలానా అక్బర్ అలీ, జమియా ఉలామా కమిటీ ఎస్ నిజాముద్దీన్, ముస్లిం ఫెడరేషన్ ఎస్ నజీర్ హుస్సేన్, ఎంహెచ్‌పిఎస్ ఎస్ నాజర్ బాషా, సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, న్యాయవాది యస్.మహమ్మద్ అలీ ఖాన్, ఎన్‌డిపిఐ అలీ ఖాన్, విద్యాశాఖ (గ్రూప్ ఆఫ్ కళాశాల రెస్పాండెంట్ పి. మన్సూర్ అలీఖాన్, జనతా మెడికల్ స్టోర్స్ ఎస్.రియాజ్, ప్రొఫెసర్ ఎస్.ఎం. ఫరూక్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు బి.గురుమూర్తి, లోక్‌సత్తా నాయకులు కృష్ణ ఆవాజ్ నాయకులు ఎస్.ఎ.సత్తార్, అన్వర్ బాషా, మహబూబ్ బాషా, షరీఫ్ సదస్సు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. అబ్దుల్ సుభాన్

ముస్లిములకు అన్యాయం జరగనివ్వం

మైనార్టీ శాఖ మంత్రి ఫారూఖ్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వక్ఫ్ చట్టం విషయంలో ముస్లిమ్ మైర్టీలకు అన్యాయం జరుగనివ్వమని మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.ఎం.డి ఫారూఖ్ ముస్లిములకు హామీ ఇచ్చారు. స్థానిక ఫంక్షన్‌హాలులో ఆదివారం ప్రొద్దుటూరు అంజుమన్ అహ్లెఇస్లాం ఆధ్వర్యంలో మంత్రి ఫారుఖ్‌కు, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే వక్ఫ్ ఆస్తులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వక్ఫ్ కు సంబంధించి 8లక్షల ఎకరాలు ఉన్నాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ముస్లిములకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ముస్లిములకు అన్యాయం జరిగిందని, ముస్లిం పేదప్రజలకు అందే పథకాలను రద్దు చేసి ఆర్థికంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పథకాలను పునరుద్ధరించడంతో పాటు వారిసంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. పూర్వీకులు మసీదులకిచ్చిన స్థలాన్ని ఎవరైనా కబ్జాలు చేస్తే సంహించేది లేదని వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడుతామని అన్నారు. అర్హతలేకున్నప్పటికీ జగన్ ప్రతిపక్ష హోదా కోరుకోవడం తగదని తెలిపారు. పులివెందుల ప్రాంత ప్రజలు జగన్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకొన్నారని అసెంబ్లీకొచ్చి పులివెందుల ప్రాంత సమస్యలపై మాట్లాడి పరిష్కరించుకోవాలని హితవు పలికారు. 40 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నానని వక్ఫ్‌బోర్డుపై అవగాహన ఉందన్నారు. 1978లో బాగారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఏర్పాటు చేశామన్నారు. ముస్లిములకు మంచి జరిగిందంటే తెలుగుదేశం హయాంలోనే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి పరిపాలన దక్షత కలిగిన వ్యక్తి అన్నారు. చంద్రబాబు హయాంలో కడపలో హజ్‌హౌస్ ఏర్పాటు చేశామని గత జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులొచ్చాయని తెలిపారు. హైదరాబాద్‌లోనూ హజ్‌హౌస్ తమ హయాంలో నిర్మించామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ విభజిత రాష్ట్రానికి అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ప్రణాళికలున్నాయన్నారు. భూవివాదాల పరిష్కారం విషయంలో ఈ నెల 16 నుంచి కడపలో సీనియర్ కార్యదర్శి అందుబాటులో ఉంటారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముస్లిములకు వందశాతం మేలు జరుగుతుందన్నారు. ప్రొద్దుటూరులో కూరగాయల మార్కెట్‌లో గత పద్ధతులే ఉంటాయన్నారు. అవినీతి ఆస్కారం ఉండదన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీకి చెందిన మంత్రి డిప్యూటి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ముస్లిములకు చేసిన మంచి ఏమీలేదని విమర్శించారు. హజ్‌యాత్ర ముగించుకొని వచ్చి నెలరోజులు దాటిపోయిందని ఎన్నికల కోడ్ ముగిసినందున హజ్‌యాత్రికులకు ఇవ్వాల్సిన సబ్సిడీ మొత్తం మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో సుమారు 50 మంది వరకు హజ్‌యాత్రికులు ఈ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారని మంత్రికి విన్నవించారు. అనంతరం న్యాయవాదుల సంఘం,క ూరగాయల మార్కెట్ సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో మంత్రిని, ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడు, అంజుమన్ నాయకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు



మాట్లాడుతున్న మైనార్టీశాఖ మంత్రి ఫారూఖ్

నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె. శ్రీనివాసులు

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మున్సిపాలిటీలో ప్రధాన డ్రెయినేజీ పూడికలు తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులు కేటాయించిందని, మున్సిపల్ కమిషనర్ టెండర్లు పిలవకుండా తన బినామీలతో పనులు చేయించడం దారుణమని, వాటిపైన శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధాన డ్రెయినేజీ పూడిక పనులు సక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులు విడుదల చేయడం హర్షణీయమన్నారు. కానీ బద్వేల్ పట్టణంలో కేవలం మైదుకూరు రోడ్డులో మాత్రమే చేస్తున్నారని, మిగిలిన మూడు ప్రధాన రహదారులలో పూడికతీత పనులను చేయలేదని, పనులకు టెండర్లు పిలిచారా లేక కమిషనర్ తన బినామీ కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారని వాపోయారు. అరకొరగా మైదుకూరు రోడ్డులో తీసిన పూడికలను సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా ఎత్తించకుండా, రాత్రివేళలో అరకొరగా చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రోడ్ల పైన చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల వాహనదారులకు, పాదాచారులకు చాలా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పూడిక తీసి పగలగొట్టిన డ్రెయినేజీ కాలువల ఫొటోలు బయటపెట్టాలని, నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, కడప నుంచి మనుషులను తీసుకొచ్చి కమిషనర్ తన బినామీల ద్వారా చేయిస్తున్నాని తెలిపారు. నిధులతో ఎక్కడెక్కడ పూడికలను తీయిస్తున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధులు దుర్వినియోగం కాకుండా బద్వేలు పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులలో ఈ పూడిక పనులను చేయించి వర్షాకాలంలో పట్టణ ప్రజల ఇబ్బందులకు శాశ్వతమైన పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గంగనపల్లి నాగార్జున, డివైఎఫ్ఐ నాయకులు ఖలీల్, షరీఫ్, నాయబ్, కెవిపిఎస్ బద్వేల్ పట్టణ అధ్యక్షులు సగిలి రాయప్ప, సిఐటియు నాయకులు గంప సుబ్బరాయుడు, గురయ్యా చెన్నయ్య, బాలయ్య, ఐద్వా మహిళా సంఘం నాయకులు మోక్షమ్మ , బాలమ్మ రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

జిల్లాకు అఖండ కీర్తి తెచ్చిన కులశేఖర్

-ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

తెలుగు నాటక రంగ చరిత్రలో మన జిల్లాకు అఖండమైన కీర్తినార్జించి పెట్టిన వారిలో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ మొట్టమొదటివాడని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం కడప రాజీవ్ కల్చర్ క్లబ్‌లో వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ సంస్మరణ సభ నిర్వహించారు. మొదట కుల శేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ నాటక కర్తగా, నటునిగా, దర్శకునిగా, ప్రయోక్తగా పల్లేటి సాధించిన విజయాలకు ఆయనకు వందలాది సన్మానాలు లభించని తెలిపారు. అయన ఇంటి నిండా నందులే కానీ ,అన్నీ ఇబ్బందులే అంటూ ఉండేవారని అన్నారు. రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ గురువు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పర్యవేక్షణలో యోగివేమన విశ్వవిద్యాలయంలో పల్లేటి రచనలు- ఒక పరిశీలన అనే అంశంపై నేను పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకోవడం నిజంగానే తన అదృష్టమని పేర్కొన్నారు. పరిశోధనా సమయంలో కులశేఖర్ తనకుఎన్నో అమూల్యమైన విషయాలు చెప్పేవారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తెలుగు నాటక రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకత నిలుపుకున్నారని అన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ కడపలో చిన్న నాటక రచయితగా ప్రారంభమైన ఆయన జీవితం సినిమాల వరకు వెళ్లిందని, ఆయన రాసిన మొదటి సాంఘిక నాటకం తపస్సు సినిమాగా వచ్చిందన్నారు. రిటైర్డ్ హిందీ అధ్యాపకులు కల్లూరు బాల ఎల్లారెడ్డి, జి. సత్యరాజు, పి.నారాయణ రెడ్డి,తపలిస్ట్ గంగయ్య, పి.వి.కృష్ణయ్య పాల్గొన్నారు.



కులశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

చేనేత కళాకారులను ప్రోత్సహించండి

ప్రజాశక్తి - కడప

చేనేత వస్త్రాలను ధరించి, చేనేత పరిశ్రమను, చేనేత కళాకారులను ప్రోత్సహించాలని జెసి అదితి సింగ్, స్థానిక శాసన సభ్యులు మాధవిరెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన అమ్మకాల స్టాళ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ చేనేత కళాకారులను ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలను ధరించి, చేనేత పరిశ్రమను ప్రోత్సాహించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలను ధరించి వారి ఆర్థిక అభివృద్ధికి చేయుతనివ్వాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. తాను చేనేత వస్త్రాలు తప్ప మరో వస్త్రాలు ధరించనని చెప్పారు. చేనేత స్వంత మగ్గంపై తయారు చేసిన వస్త్రాలను ఉత్పత్తి ధరకే ఇక్కడ అమ్మడం జరుగుతోందని అన్నారు. ప్రతి ఒక్కరూ చేత వస్త్రాలను ధరించి చేనేతలకు తోడ్పాటును అందించాలన్నారు. అంతకు మునుపు చేనేత వస్త్ర స్టాల్‌ను సందర్శించి వారిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్ర, చేనేత జౌళీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నగరాజ రావు, రాష్ట్ర పొలిట్ బ్యూరో శ్రీనివాసులురెడ్డి, చేనేత జాతీయ ఐక్య వేదిక కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, నాయకులు జె వి రమణ, సంగటి మనోహర్, చేనేత జౌళీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభిస్తున్న జెసి, ఎమ్మెల్యే

117 జీవోను వెంటనే రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రెండేళ్ల కిందట గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో ప్రకారం ఇప్పుడు పని సర్దుబాటు చేయడం సరైందని కాదని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ 'మేముఅధికారంలోకి వస్తే వెంటనే 117 జీవో రద్దు చేస్తాం' అని హామీ ఇచ్చా రన్నారు. ఇచ్చిన హామీ ప్రకారంగా జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. జీవో లోప భూయిష్టమైందని పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం మాత్రమే ప్రవేశ పెట్టడం వల్ల అటు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. మాతృభాషను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా అన్ని రకాల పాఠశాలలో వెంటనే ప్రవేశపెట్టాలని కోరారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠ శాలలో విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను దెబ్బతీశారని చెప్పారు. జీవో రద్దు చేయకపోతే ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇది మంచిది కాదని అన్నారు. తెలుగు మీడియం లేని కారణంగా 90 శాతం ఉన్నత పాఠశాలలు 8 సెక్షన్లు మాత్రమే కలిగి ఉన్నాయన్నారు. జీవో ప్రకారం 8 సెక్షన్లకు ఒకే ఉపాధ్యాయుడు నిరంతరాయంగా బోధించాలని వస్తుం దని తెలిపారు. ఉపాధ్యాయులు విరామం లేకుండా బోధించాలి అంటే చాలా కష్టంగా ఉంటుందని చెప్పారు. వాస్తవ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని నిర్ణ యాలు తీసుకోవాలని చెప్పారు.




సమావేశంలో మాట్లాడుతున్న శివార్జున

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని విశ్వనాధపురం రైల్వే గేటు వద్ద రూ.10 కోట్ల వ్యయంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం కడప ఎమ్మెల్యే మాధవి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ా ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. లోతట్టు పది మీటర్ల వెడల్పుతో రాకపోకలకు రెండు వరసల రోడ్డు బ్రిడ్జి ఏర్పాటుతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. తెలుగుదేశం పాలనలో అభివృద్ధి జరుగుతుందని, పెండింగ్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడప ఎంపీ అవినాష్ రెడ్డి కడప, బెంగుళూరు లైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే మంత్రిని అడగడం హాస్యాస్పందంగా ఉందన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండి కడప, బెంగళూరు రైల్వే లైను సాధించలేని ఆయన ఇప్పుడు ఏమి సాధిస్తారని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణ చైతన్య రెడ్డి

ఎస్ఐ నాగమురళికి సన్మానం

ప్రజాశక్తి-కలసపాడు

మండల ఎస్ఐ నాగ మురళి బదిలీపై ఎర్రగుంట్లకు వెళ్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రజలు , పోలీస్ శాఖ సిబ్బంది ఆయనకు స్థానిక చిత్తా, రాజ మనోహర్ రెడ్డి కళ్యాణ మండపంలో వీడ్కోలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పోరుమామిళ్ల సిఐ తిమోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి సూచనలు, సలహాల మేరకు బాధ్యతాయుతంగా ఇచ్చిన పనిని సక్రమంగా పూర్తిచేసి అటు అధికారులలో ఇటు ప్రజలలో మంచి ఆదరణ పొందిన అధికారి మురళి అని తెలిపారు. అనంతరం ఎక్స్ ఆర్మీ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్టేషన్‌లో అడుగుపెట్టిన ప్రతి వ్యక్తిని చిరునవ్వుతో పలకరించుటమే ఆయనలో ఉన్న గొప్ప సుగుణమని తెలిపారు. తద్వారా బాధితుడు తనలో ఉన్న సమస్యనంతటిని చెప్పి ఊరట పొందుతారని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంకన్న గురివి రెడ్డి, సుధా రామకృష్ణారెడ్డి, బోధన బోయిన నారాయణ, సొసైటీ ప్రెసిడెంట్ , పురుషోత్తం రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, కలసపాడు శ్రీధర్, రాంబాబు,కాశి నాయన, కలసపాడు, పోరుమామిళ్ల స్టేషన్‌ల్లోని పోలీస్ సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

నగరంలో ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఎస్ఐల బదిలీల నిర్వహించింది. అందులో భాగంగా ఆదివారం పలువురు ఎస్ఐలు నగరంలో బాధ్యత స్వీకరించారు. వన్ టౌన్ ఎస్ఐగా అమర్నాథ్ రెడ్డి, చిన్న చౌకు ఎస్ఐగా రాజరాజేశ్వర్‌రెడ్డి, రిమ్స్ ఎస్ఐగా జయ రాములు బాధ్యతలు స్వీకరించారు.

'ఉర్దూ'సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరులో ఉర్దూ విద్యా సదస్సులు, అక్టోబర్ లో రాష్ట్ర ఉర్దూ విద్యా సదస్సు నిర్వహించనున్నామని 'రూటా' ఏపీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాషా, సయ్యద్ ఇక్బాల్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 15 డిమాండ్‌పై చర్చిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగులను వేధించడం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

తన కింది స్థాయి ఉద్యోగులను వేధించడం మండల అభివృద్ధి అధికారికి తగదని సామాజిక కార్యకర్త బి.హరికృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్‌ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి తన దృష్టికి వచ్చిన విషయాలపై న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. ఇందులో భాగంగా ఇటీవల పెండ్లిమర్రి మండల అభివృద్ధి అధికారిపై వచ్చిన పలు ఆరోపణలను ఆయన మీడియాకు తెలిపారు. ఇసుక రవాణా, పంపిణీకి సమయ పరిమితి లేకుండా కొంత మంది రాత్రి, పగలు ఇసుకను తరలిస్తున్నా పట్టించు కోవడం లేదని చెప్పారు. మహిళలను వేధింపులకు గురి చేయడం తగదన్నారు. సిబ్బందికి ఆరోగ్యం సరిగా లేక పోయినా సెలవు ఇవ్వకుండా డ్యూటీ చేయాలని బెదిరించడం తగదన్నారు. ఇప్పటికైనా తన కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల మానవతా దృక్పథంతో చూడాలని కోరారు. లేకపోతే పై అధికారులకు పిర్యాదు చేయాల్సి ఉంటుందని చెప్పారు.



మాట్లాడుతున్న హరికృష్ణ

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో శ్రీకాంత్ ప్రతిభ

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

పోటీలో పాల్గొనేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురు చూపు

ప్రజాశక్తి - కడప అర్బన్

నిరుపేద కుటుంబాలలో వారి పిల్లలను చదివించడం కష్టమైన ఈ తరుణంలో విద్యతో పాటు క్రీడలలోనూ ముందుకు వెళ్లాలంటే ఆ క్రీడాకారులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుంది. క్రీడలలో నిరుపేద విద్యార్థులు మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో వారు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న అంశం. తల్లి దండ్రులు బిడ్డలను క్రీడలకు పంపడానికి ఆనందంగా ఉన్నప్పటికీ వారి ఆర్థిక స్తోమత లేక క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైంది. కడప జిల్లా, పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన ఎ.శ్రీనివాసులు ఎ. గంగ రాణి కుమారుడు .శ్రీకాంత్ వాల్ బాల్ క్రీడారంగంలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. గత నెల 26 ,27, 28 తేదీలలో రాజస్థాన్లో నోహన్ మండలం హనుమగర్ జిల్లాలో నిర్వహించిన వాలీ బాల్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. రాజస్థాన్ వెళ్లి మంచి ప్రతిభ కనపరిచి అండర్-18 బాలుర విభాగంలో బంగారు పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. వాలీ బాల్ అంతర్జాతీయ స్థాయి పోటీలు నేపాల్ దేశంలోని ఫోఖ్రా పట్టణంలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే పోటీలలో శ్రీకాంత్ ఎంపికైనట్లు ఇండియన్ వాలీ బాల్ అధ్యక్షులు ఆశిష్, ప్రధానకార్యదర్శి కుమార్ సింగ్ గౌరీ తెలిపారు. ఇతని ఎంపిక పట్ల ఆంధ్రప్రదేశ్ వాలీ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రంభ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా అభినందించారు. శ్రీకాంత్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి తమ వంతు ఆర్థికంగా ఆదుకోవాలని కడప జిల్లా వాలీ బాల్ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రసాద్ కోరుతున్నారు. దాతలు 8121884514లో సంప్రదించి ఆర్థిక సాయం చేయాలని కోరారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని చెన్నారెడ్డిపల్లి ఆర్‌సిఎం పాఠశాలలో 1975 - 76 ఏడా దిలో ఏడవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. బి. భాస్కర్‌రెడ్డి, ఎం. శివ శంకర్‌రెడ్డి, కన్నా. జోజులు, ఎం.నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రేవడెంట్ ఫాదర్ బాలస్వామి హాజరయ్యారు. అనంతరం పాఠశాల 1975 పనిచేసే ఉపా ధ్యాయులలో హిందీ మాస్టారు బాలశౌరి మాట్లాడుతూ దాదాపు 49 సంవత్సరాలు పాఠశాలను ఉపాధ్యాయులను జ్ఞాపకం పెట్టుకొని ఇప్పుడు 18 మంది పూర్వ విద్యా ర్థులతో కలసి యోగక్షేమాలు తెలియపరచుట ఎంతో ఆనందం ఉందని చెప్పారు. అనంతరం పాఠశాల మొదటి గురువు కన్నా పాపయ్య నేతృత్వంలో పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరు, మంచిగా క్రమశిక్షణ పట్టుదలగా ఉంటూ ఉద్యోగాలలో స్థిరపడ్డారని చెప్పడంలో సందేహం లేదు. చక్కటి ఆత్మీయ విందును ఆరగిస్తూ పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మైదుకూరు డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - మైదుకూరు



మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా రాజేంద్రప్రసాద్ ఆదివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి పెడతామన్నారు.

అర్బన్ ఎస్ఐగా సుబ్బారావు

మైదుకూరు అర్బన్ ఎస్ఐగా సుబ్బారావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఎస్ఐల బదిలీల్లో భాగంగా ఆయన మైదుకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పెద్దముడియం : పెద్దముడియం కొత్త ఎస్ఐగా సుబ్బారావు ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాల జోలికి పోరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవితం కొనసాగించాలని కోరారు. జూదం, మట్కా, బెట్టింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో రాజకీయ గ్రూపులు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే.. ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మండల వ్యాప్తంగా పలుచోట్ల ఇటీవల చోరీ ఘటనలు అధికంగా చోటుచేసుకున్నాయి. వరుస చోరీ ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతుండేవారు. పోలీసులు రాత్రిపూట గస్తీని ముమ్మరంగా చేపడుతున్నా, దొంగతనాలు ఆగేవి కావు. శనివారం రాత్రి చోరీలకు పాల్పడుతున్న పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మండల పరిధిలోని సుంకేసుల సమీపంలోని కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. శనివారం రాత్రి ఎఎస్ఐ నాగరాజుతోపాటు హెూంగార్డు ఓబుల్‌రెడ్డి గస్తీ విధులు నిర్వహిస్తుండగా వీరిని చూసి నిందితులు ద్విచక్ర వాహనంపై పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు చాకచక్యంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. చోరీలకు సంబంధించి నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. చోరీ ఘటనలకు సంబంధించి పోలీసులు వివరాలను వెల్లడించాల్సి ఉంది.

కృష్ణానది బోర్డు రాయలసీమలో ఏర్పాటు చేయాలి

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాలన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు అయినప్పటికీ కృష్ణా బోర్డు కార్యాలయం రాష్ట్రానికి తరలించకుండా హైదరాబాద్‌లోనే ఉంచడం శోచనీయమన్నారు. మోడీ, బాబు, జగన్ వల్లే కృష్ణానది యాజమాన్యం బోర్డు రాష్ట్రానికి రాలేదని విమర్శించారు. శ్రీశైలం రిజర్వాయర్ ఆధారంగా తెలుగుగంగ, హంద్రీ-నీవా, వెలుగొండ, కల్వకుర్తి, ఎస్ఆర్‌బిసి కుడి-ఎడమ జల విద్యుత్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వాయర్ సమీపంలోని రాయలసీమలో కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం ఏర్పాటు చేస్తే సమంజసమన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయాన్ని రాజమండ్రిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేయాలని కోరారు. విభజన చట్టం సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజు ల్లో కృష్ణా బోర్డు యాజమాన్యం కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మార్చాల్సి ఉందన్నారు.

భారత్‌బంద్ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న తలపెట్టనున్న భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు రామోజీ ఇమ్మానియేల్, రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ పిలుపు మేరకు భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత్‌బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని గున్నం పాటి వెంకటరమణ పిలుపునిచ్చారు.



విజేతలుగా నిలిచిన చెస్ క్రీడాకారులు

అట్టహాసంగా జిల్లా స్థాయిచెస్ పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా చెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో అండర్-13 టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి పి.అభిరామన్ ప్రథమ స్థానం, జి.ప్రణవ్‌రెడ్డి ద్వితీయ స్థానం ఓపెన్ కేటగిరీలో సాధించారు. అండర్-13 బాలికల విభాగంలో కటారి జ్యోత్స్న ప్రథమ స్థానం, జి.తేజోమయి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-9 విభాగంలో పి.రామ్ రిధాన్ష్, జి.వెంకట సుశాంత్, జి.మోక్షిత్‌రెడ్డి, అండర్-11 విభాగంలో ఎస్.రితిక్ యాదవ్, సి.హనీష్, టి.హేతవ్, ధాత్రి చెస్‌లో వివిధ పతకాలు సాధించారు. అండర్-7 విభాగంలో ఎంవీఎస్ కుశాంక్, అండర్-11 బాలికల విభాగంలో కె.హర్షిత వివిధ పతకాలు సాధించారు. కడప జిల్లా టోర్నమెంట్‌ను ఆల్ కడప చెస్ అసోసియేషన్ సభ్యులు జి.రామసుబ్బారెడ్డి టోర్నమెంట్ డైరెక్టర్‌గా, ఇమామ్ హుస్సేన్ చీఫ్ ఆర్బిటర్‌గా, జిలాన్ ఆర్బిటర్‌గా వ్యవహరించారు.

ప్రతి వాహనానికి రికార్డులు తప్పనిసరి

ప్రజాశక్తి - వేముల

ప్రతి వాహనదారుడు సంబంధిత రికార్డులు తప్పనిసరిగా తమ వద్దే ఉంచుకోవాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆదివారం సాయంత్రం కృపానగర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను ఏకాగ్రతతో నడపాలన్నారు. మద్యం తాగి నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రసూల్, మస్తాన్ పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేనా..!

పద్మవ్యూహంలా ట్రాఫిక్-తరచూ రోడ్డు ప్రమాదాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పారిశ్రామిక ప్రాంతమైన ఎర్రగుంట్లలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తూ.. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి కావడం, పారిశ్రామిక ఖ్యాతిని గడించడంతో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో స్థానిక నాలుగు రోడ్లు రద్దీగా ఉంటుంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పట్టణంలోని కడప-తాడిపత్రి రహదారి విస్తరణ పనులకు కడప పార్లమెంటు సభ్యులు వై.ఎస్.అవినాష్ రెడ్డి, స్థానిక ఎమెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ రహదారుల సంస్థ సుమారు రూ.33 కోట్ల వ్యయంతో విస్తరణ పనులను పూర్తి చేసింది. అయితే నాలుగు రోడ్ల కూడలి ప్రాంతం ముద్దనూరు రోడ్డులో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించకుండా, కొద్ది మేర రోడ్డును వెడల్పు చేసి మధ్యలో డివైడర్‌తో సహా నిర్మించారు. కూడలి లోని ట్రాఫిక్ దిమ్మెను రోడ్లకు మధ్యగా ఏర్పాటు చేయకుండా అలాగే వది లేశారు. దీంతో కూడలిలోని రోడ్లు ఒక క్రమ పద్ధతిలో లేకుండా తయార య్యాయి. ట్రాఫిక్ దిమ్మె అడ్డుగా ఉన్న కారణంగా వాహనాలు దీన్ని ఢీ కొట్టడం పరిపాటిగా మారింది. నాలుగు వైపుల నుంచి వస్తున్న వాహ నాలతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవు తున్నారు. ప్రమాదాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన పోలిసు శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి.

సిగ్నల్ వ్యవస్థ: ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని జమ్మలమడుగు ఎమెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను కోరారు. ఆ మేరకు ఎమెల్యే అధికారులతో చర్చించి తగిన సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఆ అధికారులు ఇటీవల నాలుగు రోడ్ల కూడలి ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడి రోడ్లను కాస్త వెడల్పు చేసి ట్రాఫిక్ దిమ్మె స్థానంలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ముద్దనూరు రోడ్డును వెడల్పు చేసే అవకాశం లేదు. మురుగు కాలువలతో సహా ఇటీవలే రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. చిరు వ్యాపారుల తోపుడు బండ్లను కాస్త పక్కకు జరిపి, కూడలిలోని ట్రాఫిక్ దిమ్మెను తొలిగించడం సాధ్యమవుతుంది. సిగ్నల్ వ్యవస్థతో ప్రమాదాలను నివారించడం సులభతరమని అధికారులు ఆలోచిస్తున్నారు. మరి ఆ దిశగా పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో వేచి చూడాలి.



ఎర్రగుంట్ల నాలుగు రోడ్డు కూడలిలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

వర్షం వస్తే నీరు తోడేయాల్సిందే



ట్యాంకర్‌తో నీళ్లు తోడుతున్న మున్సిపల్ అధికారులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ సుందరీకరణలో భాగంగా సెంట్రల్ బోలేవార్డును నిర్మించారు. ఇందుకోసం రూ.5.40 కోట్లు ఖర్చు పెట్టారు.. కానీ వర్షం వచ్చిందంటే నిలిచిపోయిన నీరును ట్యాంకర్లతో తోడేయాల్సిందే. వర్షపు నీరు బయటకు పోవడానికి మార్గం లేకుండా నిర్మాణ పనులు చేయడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మించిన సెంట్రల్ బోలేవార్డు పనుల వల్ల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సెంట్రల్ బోలేవార్డుకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించారు. కేవలం కాంట్రాక్టర్ కోసమే ఇది పనిచేశారా అన్నట్లుగా ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సెంట్రల్ బోలేవార్డు పనులను పర్యవేక్షించారా లేక కాంట్రాక్టర్ తన సొంత తెలివితేటలతో నిర్మించారా అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. వర్షం వస్తే ఎక్కడ చూసినా నీరు నిలుస్తోంది. ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు సెంట్రల్ బోలేవార్డులో ఎక్కడ చూసినా నీరు దర్శనమిస్తోంది. అక్కడ నిలిచిన మురికినీటితో తమకు తిప్పలు తప్పడం లేదని దుకాణాదారుల యజమానులు పేర్కొంటున్నారు. గతంలో వర్షం వస్తే ఎక్కడ చూసినా నీరు నిలుస్తుంది అన్న ఉద్దేశంతో సెంట్రల్ బోలేవార్డుపై ప్రత్యేకశ్రద్ధ వహించి నిర్మించామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేయించారని, అందువల్లనే ఎక్కడ చూసినా ఈ నీరు నిలుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. సెంట్రల్ బోలేవార్డుకు వేసిన రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండడంతో వర్షం వస్తే వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు బయటకు వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

జామ పండులో పోషకాలు బహు మెండు

సహజంగా మాగే కాయ.. ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మనలో చాలా మంది అధిక ధరలు ఉన్న పండ్లు, మంచి రంగులో ఉండే పండ్లు మాత్రమే మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని భావిస్తారు. ఎంత ఎక్కువ ధర పెట్టి కొంటే ఆ పండు అంత మంచిదని భావిస్తూ ఉంటారు. కానీ పండ్లల్లో అన్నింటి కంటే జామపండు మేలైన పండని నిపుణులు చెబుతున్నారు. పది రకాల పండ్లను తినడానికి ఒక జామపండును తింటే మన శరీరానికి కావల్సిన పోషకాలన్నీ లభిస్తాయని సూచిస్తున్నారు. జామపండు మనకు సంవత్సరమంతా చాలా తక్కువ ధరలో లభిస్తుంది. ఎవరైనా దీన్ని సులభంగా కొనుగోలు చేసి తీసుకోవచ్చు. అలాగే జామచెట్లను పెంచ డానికి ఎక్కువగా ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదు. ఇతర పండ్లను పూర్తిగా పక్వానికి రాకముందే సేకరించి కార్బైడ్ పెట్టి మగ్గించి అమ్ముతూ ఉంటారు. కానీ జామ



కాయలను మనం పక్వానికి రాకముందే కోయలేము. పక్వానికి రాని జామకాయలను మనం అస్సలు తినలేము. కనుక వీటిని మనం అస్సలు కల్తీ చేయలేమని, వీటిని తీసుకోవడం వల్ల మనం చక్కటి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. 100 గ్రాముల జామకాయలో 45 నుంచి 50 క్యాలరీల శక్తి, 200 మిల్లీ గ్రాముల విటమిన్ సి ఉంటుంది. మామిడికాయ, అరటిపండ్లను తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వెంటనే పెరుగుతాయి. కానీ జామకాయలను తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. అలాగే జామ పండ్లను తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడుతుంది. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, దగ్గు వంటి సమస్యలు మనదరి చేరుకుండా ఉంటాయి. జామకాయలను తినడం వల్ల పనితీరు, రక్తప్రసరణ వ్యవస్థ మెరుగు పడుతుంది. శరీరంలో ఇన్‌ఫ్లామేషన్ తగ్గుతుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుంటా ఉంటాం. ఈ విధంగా జామకాయలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, వీటిని రోజుకు ఒకటి చొప్పున అందరూ తప్పకుండా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

సర్పంచులకు, కార్యదర్శికు మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులును సద్వినియోగం చేసుకోవాలని యుఆర్‌డి పరుశురాం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఎంపిడివో పివి.పరుశురాం పేర్కొన్నారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలమేరకు సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మి కంపోస్ట్ తయారీ, పంచాయతి అభివృద్ధి కి సంబంధించిన ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు మండలములోని 14 గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం యల్లటూరు భవన్‌లో శ్రీనివాస రాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంగాంజనేయులు మాట్లాడుతూ ఆర్‌టిసిలో కాంట్రాక్టు విధా నంలో సుమారుగా 7,300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధా నంలో పనిచేస్తున్నారని, థర్డ్‌పార్టీ విధానం వల్ల చాలా నష్టపోతున్నామని తెలి పారు. ఆర్‌టిసిలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా సంస్థ నుంచి వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌టిసి కార్మికుల సమ స్యలను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, జోనల్ వర్క్ షాప్ అధ్యక్షులు సురేష్, రాజంపేట డిపో అధ్యక్షులు కుమార్, డిపో కమిటీ సభ్యులు గోపి, ప్రసాద్, పెంచలయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కౌన్సిలర్ ఆరా

రాయచోటి : రాయచోటి మున్సిపాలిటీలోని 20వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ డాక్టర్ పి.మదనమోహన్ పర్యటించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై ఆరా తీశారు. ముస్తఫా మసీదు వద్ద తాగునీటి బోరు మరమ్మత్తులకు గురికావడంతో ఆస్థానంలో నూతన మోటారును ఆయన ఏర్పాటు చేయించడపై ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. సింగపూర్ లైన్, ఎన్‌జిఒకాలనీ, ఎస్‌వి.విద్యామందిర్ స్కూల్ తదితర ప్రాం తాలలో డ్రెయినేజీ, నూతన రోడ్ల నిర్మాణాలను మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి సహకారంతో చేపడతామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. ఐదు వార్డుల నుంచి ఈ ప్రాంతంలోకి వర్షపు నీరు చేరడంతో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను బాగుచేయిస్తానని చెప్పారు.

దెబ్బతిన్న పశువైద్యశాలలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పలు గ్రామాల పశువైద్యశాలల భవనాలు దెబ్బతిన్నాయి. పల్లవోలు, సీతారామపురం, చియ్యపాడు, అన్నవరం, చిన్న గురవలూరు, లక్ష్మీపేట, అనంతపురం, వెదురూరు, సోమాపురం గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. వీటిలో పల్లవోలు, సీతారామపురం, వెదురూరు గ్రామాల్లోని భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సీతారామపురంలో బిల్డింగ్ వెనుక వైపు కూడా గతంలో కురిసిన తుఫానుకు పడిపోయింది. పల్లవోలులో భవనం పైకప్పు చాలావరకు దెబ్బతింది. సోమాపురంలో భవనం పూర్తిగా దెబ్బ తినడంతో దాని స్థానంలో కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయిదేళ్లుగా ఆ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో మూతపడిన పాఠశాలలో పశువైద్యశాల నడుస్తోంది. చిన్న గురువలూరు గ్రామంలో భవనాలు వర్షానికి ఊరుస్తూ పైకప్పు ఊడి పడుతుండడంతో ఇక్కడ కొత్త భవనాన్ని నిర్మించారు. చియ్యపాడు, అన్నవరం, లక్ష్మీపేట భవనాలు కాస్త పర్వాలేదు. వెదురూరులో కొత్త భవనానికి నిధులు మంజూరైనప్పటికీ స్థల సమస్య ఉంది. ఇక్కడ కూడా దెబ్బతిన్న భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సోమాపురంలో మధ్యలో ఆగిపోయిన భవన నిర్మాణ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పల్లవోలు, సీతారామపురం గ్రామాల్లో కొత్త భవనాలు ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గత వారంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా ప్రజాప్రతినిధులు పశువైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. చియ్యపాడులో వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. సీతారామాపురంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఈ పశువైద్యశాలను అయ్యవారిపల్లెకు మార్చాలని కోరారు.



సీతారామాపురంలో దెబ్బతిన్న పశువైద్యశాల



కమిషనర్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని త్వరలో పాత మున్సిపాలిటీ కార్యాలయానికి మార్పు చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కమిషనర్ జబ్బర్‌మియాకు సూచించారు. ఆ మేరు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే పాత మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణాన్ని, రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత మున్సిపల్ కార్యాలయంలో రూములు నిర్మించి జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్, స్టాంప్ రైటర్లకు ఇవ్వాలని సూచించారు. మైదుకూరు పట్టణంలోని చికెన్, మటన్, ఫిష్ దుకాణాలన్నీ ఒకేచోట ఉండేలా ఓ సముదాయాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎపి రవీంద్ర, యాపరాల చిన్న పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న తిరుపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

విభిన్నప్రతిభావంతులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దేవిరెడ్డి తిరుపాల్‌రెడ్డి దశమ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 20 మంది విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రెడ్డిమెస్ యాజమాన్యం వారి సేవస్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈసందర్భంగా విభిన్నప్రతిభావంతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, శీలం సునీల్, దివంగత తిరుపాల్‌రెడ్డి సతీమణి దేవిరెడ్డి నారాయణమ్మ, కుమారుడు దేవిరెడ్డి మాధవరెడ్డి, కుమార్తెలు సుమతి, పవిత్ర, అల్లుళ్ల గజ్జూరి కుళ్ళాయిరెడ్డి, మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గత పాలనను గుర్తు చేసుకోవాలి

టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పి. మునిశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు



గత పాలన గురించి వైసిపి నాయకులు గుర్తు చేసుకోవాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి రాజకీయంగా పూర్తి ఆత్మరక్షణలో పడిపోయి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యం ఏలుతుందని మీడియా సమావేశంలో మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తమ పరిపాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఎలా ఇబ్బందులు గురి చేసినారో ప్రజలు గమనించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో హింస పెరిగి పోయిందని, కూటమి అధికారంలోకి వచ్చినాక 36 రాజకీయ హత్యలు జరిగా యని జగన్ ఢిల్లీ దాకా వెళ్లి ధర్నా చేశారని, అప్పుడు కొన్ని జాతీయ మీడియా సంస్థలు ఈ 36 హత్యల పేర్లు చెప్పమంటే జగన్ మీడియా సమావేశం నుంచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. ముందు పార్టీ మనుగడ ఉంటుందో లేదో అని జగన్ ఆందోళన చెందుతున్నారే తప్ప, రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయ న్నారు. ఇకనైనా ఈ విష ప్రచారం మానుకోవాలని ఆయన హితవు పలికారు.



అభిషేక పీఠాన్ని వితరణ చేస్తున్న నాగిరెడ్డి కుటుంబ సభ్యులు

గండి అంజన్నకు అభిషేక పీఠం వితరణ


ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో వెలసిన ఆంజనేయస్వామి గుడికి ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామం వాస్తవ్యులు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు అభిషేక పీఠాన్ని వితరణ చేశారు. నాగిరెడ్డి కుటుంబసమేతంగా టేకుతో తయారుచేసిన పీఠాన్ని ఆదివారం వితరణ చేశారు. దీని విలువ దాదాపు రూ.లక్ష ఉంటుంది. వితరణ చేసిన నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు పేర్లతో అంజన్న సన్నిధిలో ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. పీఠాన్ని గురించి దేవస్థాన సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్యకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చర్చిల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలి

ప్రజాశక్తి - మైదుకూరు

రాష్ట్రంలోని చర్చిల అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని మైదుకూరు టిడిపి 21వ వార్డు బూత్ ఇన్‌ఛార్జి ప్రసాద్ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులుగా నియామమైన స్వామిదాస్‌ను కోరారు. ఆ మేరకు ప్రసాద్ ఆదివారం అనంతపురంలో స్వామిదాస్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చర్చిల అభివృద్ధిలో భాగంగా ప్రహరీలు నిర్మించాలని కోరారు.



స్వామిదాసును సన్మానిస్తున్న ప్రసాద్

రెడ్డమ్మ ఆలయానికి విరాళం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డమ్మ దేవత దేవస్థాన ఆలయ అభివృద్ధి పనులకు కొత్తకోట మండలం, బడికాయలపల్లికి చెందిన డాక్టర్ మానేరి వెంకటరమణ రూ.50,116లు, బెంగుళూరుకు చెందిన వెంకట కిరణ్ కుమార్ రూ.25,116లు నగదును విరాళంగా అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దాతలను సన్మానించారు. ఈమొత్తాన్ని ఇండియన్ బ్యాంకు వాయల్పాడులో ఆలయ ఖాతాకు జమ చేస్తామని ఆలయ ఇఒ మంజరుల తెలి పారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.